క్లుప్తంగా

నేటి నుంచి బాబా మందిర వార్షికోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ శ్రీ భగవాన్ షిర్డీ సాయిబాబా మందిరం 13వ వార్షికోత్సవాలు బుధవారం నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం ఆరు గంటలకు సంధ్యాహారతితో వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం అవుతాయన్నారు. ఉదయం 6.30 గంటలకు గణపతి పూజ, పుణ్యావచనం ఉదయం తొమ్మిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి ఏకనామం జరుగుతాయన్నారు. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు సముద్రవేణి కోలాటం భక్త బృందం షిర్డీ సాయినాథుని ఊరేగింపుతో మధురానగర్ పురవీధులలో బిక్షాటన, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు బాబా మందిరం వార్షికోత్సవంలో పాల్గొని బాబావారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆమె కోరారు.

సూర్య భగవానుడికి దశ సహస్రగులాబీ అర్చన



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివజ్ఞాన పీఠంలో మంగళవారం సూర్యభగవానుడికి పువ్వాడ కుసుమనాథ్ దంపతులచే పదివేల గులాబీలతో అర్చన జరిగింది. పీఠాధిపతి శివాచార్య సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి గులాబీలతో అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సూర్య భగవానుని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రేపు బాబాకు అభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైశాఖ మాసం సందర్భంగా ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం బాబాకు వెయ్యి మామిడి పండ్ల రసంతో అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు మామిడి పండ్ల రసంతో అభిషేకం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు స్వయంగా మామిడి పండ్లు తీసుకువచ్చి అభిషేకంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సదావకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉత్తమ సేవా పురస్కారానికి శ్రీహర్ష ఎంపిక



భవానీపురం(విజయవాడపశ్చిమ): హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆలిండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పీవీకేఎస్ హర్ష ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపిక అయినట్లు సంస్థ వ్యవస్థాపక చైర్మన్ అయ్యప్ప అరుణాచల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాధరపురానికి చెందిన పోతరాజు వెంకట కాళి శ్రీహర్ష సంస్థ పక్షాన అందిస్తున్న సేవలకు గాను ఈ పురస్కారాన్ని వచ్చే నెల విజయవాడలో ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన మానవ హక్కుల పరిరక్షణ, బాధితులకు న్యాయం కలిగేలా సంస్థ ప్రతినిధులు విశేష సేవలు అందిస్తున్నారని, అందులో భాగంగా శ్రీహర్షకు ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

రాజకీయ 'చదరంగం' వీడి.. కుటుంబంతో సరదాగా..



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గత నాలుగు నెలల నుంచి ఎన్నికల హడావుడితో ఉన్న ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మంగళవారం తన కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆటలు ఆడడం... వారికి నచ్చిన ఆహారాన్ని వండించి, కలిసి భోజనం చేసి రోజంతా కుటుంబానికే సమయం కేటాయించారు.

కొనసాగుతున్న ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో బాటసారులు, ప్రయాణికులకు అందిస్తున్న ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి దాతల సహకారంతో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం దాతలు ఆసిలేటి స్వర్ణకుమారి, రాధికల సహకారంతో బాటసారులు, ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ మాట్లాడుతూ.. దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఉచిత మజ్జిగ పంపిణీకి సహకరిస్తున్నారన్నారు. వేసవి ముగిసే వరకూ ఈ శిబిరాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

సెంట్రల్‌లో 72.96 శాతం పోలింగ్

- ఓటెత్తిన మహిళ ఓటర్లు
- పెరిగిన పోలింగ్ శాతం



ఓటు వేసేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న ఓటర్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 72.96 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,77,724 మంది ఓటర్లకు గాను 2,02,662 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 99,235 మంది పురుషులు, 1,03,385 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల కంటే మహిళలు అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారు. పురుషుల కంటే మహిళలు 4,150 మంది అధికంగా ఓటెత్తారు. నియోజకవర్గంలో మహిళల ఓటర్లు 1,42,845 మంది ఉండగా వీరిలో 1,03,385 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే సెంట్రల్‌లో ఓట్ల సంఖ్య, ఓటింగ్ శాతం పెరిగింది. 2019 ఎన్నికల్లో సెంట్రల్‌లో 65.73 శాతం పోలింగ్ జరిగింది. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రభావంతో మహిళా ఓటింగ్ శాతం పెరిగిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలో 267 పోలింగ్ బూత్‌లు ఉండగా ప్రతి బూత్‌లోనూ మహిళల ఓట్లే అధికంగా పోలయ్యాయి. ఇది అధికార పార్టీకి అనుకూలించే అంశంగా మారిందని విశ్లేషకులు అంటున్నారు. ఎక్కడ చూసిన గెలుపోటములపైనే చర్చ.. ఎన్నికల ముగిసిన తర్వాత ఏ కూడలిలో చూసిన గెలుపోటములపైనే చర్చించుకుంటున్నారు. ఫలానా అంశం ఫలానా పార్టీకి కలిసి వస్తోందని కూడికలు, తీసివేతలు చేస్తున్నారు. పార్టీల శ్రేణులు బూత్‌ల వారీగా విశ్లేషణ చేసుకుని పందాలకు సిద్ధమవుతున్నారు. అభ్యర్థుల మెజారిటీపై కొందరు పందాలు పెడుతుంటే మరికొందరు గెలుపోటములపై పందాలు వేస్తున్నారు. గత ఎన్నికల్లో 25 ఓట్ల తేడాతో సెంట్రల్ నియోజకవర్గం నుంచి మల్లాది విష్ణు ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో ఈ ఎన్నికల్లో ఒక్క ఓటుతోనైనా మేం గెలుస్తామంటే.. మేం గెలుస్తామంటూ ఆయా పార్టీల శ్రేణులు ధీమాగా ఉన్నారు. ఇక్కడ సీపీఎం పార్టీ అభ్యర్థి ఎన్ని ఓట్లు చీలుస్తారు..? ఎవరి ఓట్లు చీలుస్తారనే అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. గాజు గ్లాసు గుర్తు జనసేన పార్టీది కావడం అది పోటీలో లేని చోట ఇతరులకు కేటాయించారు. దీని ప్రభావం కూటమి అభ్యర్థిపై ఉండొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. పోలింగ్ తర్వాత ఏ నోట విన్నా.. మహిళల ఓట్ల శాతం' అధికార పార్టీకి అనుకూలమనే మాట వినిపిస్తోంది.

ఓటర్లలో వెల్లివిరిసిన చైతన్యం

పాయకాపురం(విజయవాడరూరల్): సార్వత్రిక ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని 61, 62, 63, 64వ డివిజన్లలో పోలింగ్ శాతం పెరిగింది. గత ఎన్నికల్లో పోలైన ఓట్లతో పోల్చుకుంటే నాలుగు శాతం మంది అధికంగా ఈ డివిజన్‌లలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. 61వ డివిజన్‌లో 11,934 మంది ఓటర్లకు గాను 8,175 మంది ఓట్లు వేశారు. అనగా 78 శాతం ఓట్లు పోలైనవి, అదేవిధంగా 62వ డివిజన్‌లో 72 శాతం అనగా 14,360 మంది ఓటర్లకు గాను 10,350 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. 63వ డివిజన్‌లో 17,902 మందికి గాను 12,902 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోగా 72 శాతం ఓట్లు పోలైనవి. 64వ డివిజన్‌లో 75 శాతం పోలైనవి. విజయవాడ నగరానికి శివారు ప్రాంతంలో ఉన్న ఈ నాలుగు డివిజన్లలో సగటున 71 శాతం ఓట్లు పోలైనవి. గత ఎన్నికలతో పోల్చుకుంటే నాలుగు శాతం మంది అదనంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని పరిశీలకులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సక్రమంగా వినియోగించుకున్న వారు సంతృప్తి చెందినట్లుగా వారు అంటున్నారు. నగర శివారు ప్రాంతంలో అత్యధికంగా పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు అధికంగా ఉండటం వారికి ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలతో పాటు ఇళ్లస్థలాలు పంపిణీ, జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి పథకాల పట్ల ఆకర్షితులై ఓట్లను ప్రభుత్వానికి అనుకూలంగా వేసినట్లుగా తెలుస్తోంది.

నియోజకవర్గంలో చారిత్రాత్మక ఓటింగ్

- భారీగా ఓటు హక్కును వినియోగించుకున్న ప్రజలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారా..? మళ్లీ తమ అభిమాన నేత నేతృత్వంలో నడిచే ప్రభుత్వం కావాలని కోరుకున్నారా..? తమ బాగోగులు చూసుకుంటున్న జననేతకు బాసటగా నిలిచేందుకే ఓటర్లు కదం తొక్కారా..? అంటే ఈ ప్రశ్నలన్నిటికీ అవుననే సమాధానం వినిపిస్తోంది. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మరోమారు రాష్ట్రంలో జగన్ జన సునామి వీయబోతున్నట్లుగా తెలుస్తోంది.

నియోజకవర్గంలో అత్యధిక ఓటింగ్ శాతం..

సోమవారం జరిగిన 2024 సార్వత్రిక ఎన్నికలు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక ఓటింగ్ శాతంగా నమోదైంది. 2009లో నూతనంగా ఏర్పడిన ఈ నియోజకవర్గంలో నాటి నుంచి నేటి వరకూ జరిగిన ఎన్నికల్లో నమోదైన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి.

సెంట్రల్‌లో అ'ద్వితీయం'గా ఫ్యాన్ గాలి హోరెత్తిందా..

నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో ఫ్యాను గాలి హోరెత్తినట్లు తెలుస్తుంది. ప్రధానంగా ముస్లిం మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు వైఎస్సార్ సీపీకి అండగా నిలబడినట్లు తెలుస్తోంది. గతంలో కన్నా ఈ సారి మెజార్టీ చాలా ఎక్కువగా ఉంటుందని, సెంట్రల్‌లో అ'ద్వితీయం'గా ఫ్యాన్ ప్రభంజనం సృష్టించడం ఖాయమంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు ధీమా ఉన్నారు.

క్రాస్ ఓటింగ్ ముప్పు ఎవరికో..

నియోజకవర్గంలో చాలా చోట్ల క్రాస్ ఓటింగ్ జరిగినట్లుగా తెలుస్తోంది. వైఎస్సార్ సీపీకి పునాదులుగా ఉన్న మహిళలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు టీడీపీ నాయకులు డబ్బు ఎర వేశారు. దీంతో కొంతమంది ఓటర్లు డబ్బులు తీసుకున్నాం కాబట్టి అటు ఒకటి.. ఇటొకటి వేసినట్లు సమాచారం. అయితే ఆ క్రాస్ ఓటు ఎవరికి లాభమవుతుంది.. ఎవరి తలమీద కుంపటిగా మారుతుందనేది ఎవరికీ అంతుపట్టడం లేదు. ఏది ఏమైనా ఈ ఎన్నికల్లో ఓటర్లలో చైతన్యం పెరగడం అందరూ ఆనందించాల్సిన విషయం. ఇక్కడ గెలుపు గుర్రం ఎవరిది.. ఎవరికి ఎన్నెన్ని ఓట్లు పడ్డాయి.. పెరిగిన ఓటు శాతం ఎవరికి బలంగా మారిందనే విషయాలన్నీ తెలియాలంటే జూన్ నాలుగో తేదీ వరకూ వేచి ఉండాల్సిందే.

ఎన్నికలు జరిగిన సంవత్సరం	మొత్తం ఓట్లు	నమోదైన ఓట్లు	ఓట్ల శాతం
2009	2,23,822	1,58,267	70.71
2014	2,59,001	1,70,463	65.81
2019	2,69,912	1,78,013	65.73
2024	2,77,724	2,02,635	72.96



సోమవారం జరిగిన ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

కక్షిదారులు రాజీ పడేలా చేయండి

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణ



మాట్లాడుతున్న జడ్జి శ్రావణి, పక్కన జడ్జి శోభారాణి, బార్ అధ్యక్షుడు సుందరరావు

జగ్గయ్యపేట అర్బన్: మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు రాజీ పడేలా అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి అన్నారు. రాజీ పడటం వల్ల డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. మంగళవారం కోర్టు ఆవరణలో జగ్గయ్యపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జగ్గయ్యపేట కోర్టుల పరిధిలో ఉన్న కేసుల పరిష్కారం కోసం మధ్యవర్తిత్వం వ్యవహరించడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శోభారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రావణి మాట్లాడుతూ రాజీ పడేందుకు లోక్ అదాలత్‌ల ద్వారా అవకాశం ఉందని, ఇరు పార్టీలు రాజీ పడాలంటే ముఖ్యంగా న్యాయవాదుల మధ్యవర్తిత్వం అవసరం అన్నారు. అలాగే అదనపు జూనియర్ సివిల్ జడ్జి శోభారాణి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని, తద్వారా పెండింగ్ కేసులు పరిష్కారం కావడంతో పాటు ఏళ్ల తరబడి కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగడం, డబ్బు వృథా చేసుకోవడం తప్పుతుందన్నారు. ఆ దిశగా న్యాయవాదులు కక్షిదారులను ఎడ్యుకేట్ చేయాలని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాక సుందరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బి.వెంకట్రామయ్య, పి.సత్యశ్రీనివాసరావు, ఎస్.నరసింహారెడ్డి, జె.శ్రీనివాసరావు, ఏజీపీ టీఎల్.నరసింహారావు పాల్గొని న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆంజనేయులు, విజయకుమారి పాల్గొన్నారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు తవ్వా శ్రీనివాస గుప్తా సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

- పార్కుకు సందర్శకుల తాకిడి
- మానసికోల్లాసం కోసం వస్తున్న నగరవాసులు
- ఒత్తిళ్లను అధిగమించేందుకు దోహదపడుతున్న వైనం
- వ్యాయామం కోసం ఓపెన్ జిమ్‌ను ఆశ్రయిస్తున్న ప్రజలు



కృష్ణమ్మ జల విహారం పార్కులో సందర్శకుల సందడి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్నికల వేడి చల్లారింది. పోలింగ్ ముగిసింది. కౌంటింగ్‌కు మరో 20 రోజుల సమయం ఉంది. పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు కూడా ఇచ్చారు. దీంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. నేటి యువత ఒత్తిడి జీవనం నుంచి బయటపడేందుకు, ప్రకృతి ఒడిలో సేద తీరేందుకు వీకెండ్స్‌లో దూర ప్రాంతాల్లోని ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చని ప్రదేశాల్లో గడిపేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఇప్పుడు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా, నగరంలోనే నందనవనం లాంటి పార్కు అందుబాటులోకి వచ్చింది. కృష్ణానదీ తీరాన ఏర్పాటు చేసిన కృష్ణమ్మ జలవిహారం పార్కు ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల కోసం ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. దాంతో పాటు నగరంలో రాజీవ్‌గాంధీ పార్కు, అంబేడ్కర్ పార్కు, పలు కాలనీలలో ఏర్పాటు చేసిన, అభివృద్ధి చేసిన పార్కులు అందుబాటులో ఉన్నాయి.

పరుచుకున్న పచ్చదనం

ప్రకృతి వడిలో సేదతీరేందుకు ఇంటి సమీపంలోనే పార్కులు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో రకరకాల మొక్కలను పెంచుతున్నారు. ఉద్యానవన శాఖ ద్వారా నగర పాలక సంస్థ అరుదైన మొక్కలను అక్కడ ఏర్పాటు చేసింది. పార్కును సందర్శించిన వారికి ఆహ్లాదకరమైన వాతావరాణాన్ని అందించేలా వాటిని తీర్చిదిద్దుతున్నారు. వాటిని సందర్శించి మానసికోల్లాసం పొందేలా రూపొందించారు. నగరంలోని ప్రధాన పార్కులైన రాజీవ్‌గాంధీ పార్కు, అంబేడ్కర్ పార్కుతో పాటు, పలు కాలనీల్లోనూ పార్కులు ఏర్పాటు చేశారు.

ఇంటి సమీపంలోనే...

వాకింగ్ చేయాలంటే ఒకప్పుడు దూర ప్రాంతంలోని గ్రౌండ్‌కు వెళ్లాల్సి రావడంతో మహిళలు వాకింగ్‌పై ఆసక్తి చూపేవారు కాదు. ఇప్పుడు తాము నివసిస్తున్న కాలనీల్లోనే పార్కులు ఏర్పాటు చేయడం, వాటిలో వాకింగ్ ట్రాక్‌లు ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుల్లో వాకింగ్ చేసేందుకు మహిళలే ఎక్కువగా వస్తున్నారు. పిల్లలకు ఆట పరికరాలను ఏర్పాటు చేయడంతో కొందరు మహిళల తమ పిల్లలను తీసుకుని పార్కుకు వచ్చి, వాళ్లు ఆడుకుంటుంటే, తల్లులు వాకింగ్ చేస్తున్నారు.

కుటుంబ సమేతంగా...

నగర జీవికి శారీరక శ్రమ లేకపోవడంతో ఎక్కువగా జీవనశైలి వ్యాధులకు గురవుతున్నారు. వాటి నుంచి బయట పడేందుకు వ్యాయామంపై దృష్టి సారిస్తున్నారు. ఒకప్పుడు వ్యాయామం చేయాలంటే జిమ్‌కు వెళ్లాల్సి వచ్చేది. లేదంటే దూర ప్రాంతంలో వాకింగ్ ట్రాక్ ఉన్న గ్రౌండ్‌కు వెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇంటి సమీపంలో తమ కాలనీల్లోనే పార్కులు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో వాకింగ్ ట్రాక్‌లతో పాటు, ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భార్యభర్తలతో పాటు, తమ పిల్లలను తీసుకుని పార్కులకు వచ్చి వ్యాయామం చేస్తున్న వారు ఎక్కువగా ఉంటున్నారు. మరోవైపు వృద్ధులు సైతం మానసికోల్లాసం కోసం పార్కులకు వస్తున్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వం పార్కులను అభివృద్ధి చేసింది.

మానసికంగా చాలా ఉపయోగం



బిజీ లైఫ్ నుంచి బయట పడేందుకు వాకింగ్ చాలా అవసరం. పచ్చని మొక్కలు చూస్తూ వాకింగ్ చేయడం వలన మానసిక ఉల్లాసంతో పాటు, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఉదయం, సాయంత్రం వేళ్లలో పచ్చని మొక్కల మధ్య వాకింగ్‌తో స్వచ్ఛమైన ఆక్సిజన్ బ్రెయిన్‌కు అందుతుంది. వృద్ధుల్లో జ్ఞాపకశక్తి తగ్గకుండా దోహదపడుతుంది. ఉదయం వేళ వాకింగ్‌తో విటమిన్ డి లభిస్తుంది. దీంతో ఎముకల పటుత్వంతో పాటు, హ్యాపీ హార్మోన్ విడుదల అవుతుంది. తద్వారా మానసిక ఒత్తిళ్లు తగ్గుతాయి.

–డాక్టర్ గర్రే శంకరరావు, మానసిక విశ్లేషకులు



పార్కులో పిల్లల కోసం ఏర్పాటు చేసిన పరికరాలు



ఎన్టీఆర్ కాలనీలోని పార్కులో ఇండోర్ జిమ్

ఏషియన్ పవర్ లిఫ్టింగ్‌లో కేబీఎన్ విద్యార్థికి బంగారు పతకం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏషియన్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాకరపర్తి భావనారాయణ కళాశాల విద్యార్థి పి.భరత్‌కుమార్ బంగారు పతకాన్ని సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఈ నెల తొమ్మిదో తేదీన చైనాలోని హాంకాంగ్‌లో జరిగిన ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న భరత్‌కుమార్ ఈ ఖ్యాతిని సాధించి తమ కళాశాల కీర్తిని, దేశ ప్రతిష్టను ఇనుమడింపజేశాడని అన్నారు. నగరానికి తిరిగి వచ్చిన భరత్‌కుమార్‌కు రైల్వే స్టేషన్ వద్ద కళాశాల తరపున ఘనంగా స్వాగతం పలికి అక్కడి నుంచి కళాశాల విద్యార్థులు భారీ ప్రదర్శనగా తీసుకువచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభలో భరత్‌కుమార్‌ను కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు సత్కరించి స్వాగతం పలికారు. భరత్‌కుమార్‌తో పాటు అతడిని తీర్చిదిద్దిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్రరావును అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం జరిగింది. జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు మురళీధర్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక సామాన్య ప్రజల్లో మూఢనమ్మకాలను పోగొట్టి శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. కొండపల్లి పట్టణ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మామిడి సీతారామారావు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీమోహన్, ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

సీబీఎస్‌సీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

రామవరప్పాడు: సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 10, 12వ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చారని పాఠశాల ప్రిన్సిపల్ భువనేశ్వరన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ తరగతిలో సైన్స్ టాపర్స్‌గా వజావత్ రత్నరాజ్, సిరివెళ్ల జానీ అక్షయ, కామర్స్ టాపర్స్‌గా వినుకొండ శ్రీనిధియ, నాగ శివసాయి, హ్యుమానిటీస్ టాపర్‌గా కృతి భట్టాడ్, తహ్సీన్ షిఫానా నౌషదాలి అత్యధిక మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. 10వ తరగతిలో పరిషా జైన్ 500కు 487 మార్కులు, అర్క సర్కార్ 485 మార్కులు సాధించారన్నారు. గణితంలో ఇద్దరు విద్యార్థులు 100 మార్కులు, ఐటీలో నలుగురు విద్యార్థులు 100 మార్కులు సాధించినట్లు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన పాఠశాల విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చందు, కడియాల ప్రవీణ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు, వైస్ ప్రిన్సిపల్ సంజయ్ భాటియా అభినందనలు తెలిపారు.

సెయింట్‌జాన్స్ విద్యార్థుల ప్రతిభ

గన్నవరం: సీబీఎస్ఈ పదవ తరగతి, ప్లస్ – 2 పరీక్ష ఫలితాల్లో స్థానిక వి.ఎస్.సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణతను సాధించారని ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలకు హాజరైన 205 మంది విద్యార్థులందరూ ఉత్తీర్ణతను సాధించారని చెప్పారు. వీరిలో 75 మంది విద్యార్థులు డిస్టింక్షన్ సాధించారన్నారు. వీరిలో 500 మార్కులకుగాను నిమ్మగడ్డ సాయిఈక్షిత 487, బి.ప్రణీత్ 486, ఆర్.శ్రీనిధి 481 మార్కులతో టాపర్లుగా నిలిచారని చెప్పారు. ప్లస్ 2 విద్యార్థులు కూడా నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు సీనియర్ బ్రదర్ జిమ్మికురియోకోస్, బ్రదర్ బి.జోసఫ్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి పాండురంగడి బ్రహ్మోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగస్వామి వారి ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 15వ తేదీన స్వామి వారి సన్నిధిలో రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగస్వామి వార్లకు పంచామృత తిరుమంజనం, పెళ్లికుమారుని, పెళ్లికుమార్తెను చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం స్వామి వారికి హంస వాహన సేవా కైంకర్యం, ఎదురుకోలు ఉత్సవాలు జరుగనున్నట్లు తెలిపారు. 16వ తేదీ ఉదయం స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం జరగనున్నట్లు తెలిపారు. సాయంత్రం వాహన సేవలు, సహస్ర దీపాలంకరణ సేవ ఉంటాయని పేర్కొన్నారు. 17వ తేదీన స్వామి వారికి పుష్పయాగం తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈనెల 18వ తేదీన స్వామి వారి పవళింపు సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.